సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
శనివారం । 9 । మార్చి । 2024



చీనీ టన్ను రూ.20 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో శుక్రవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.20 వేలు పలికాయి. 276 టన్నుల చీనీకాయలు అమ్మకానికి వచ్చాయి.



టమాట కిలో రూ.12

కక్కలపల్లి మండీలో శుక్రవారం కిలో టమాట గరిష్ట ధర రూ.12 పలికింది. కనిష్టం రూ.4. సరాసరి రూ.8 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
39.6°/ 19.8°

జిల్లాలో శుక్రవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. వేసవితాపం నెలకొంది. తూర్పు దిశగా గాలులు గంటకు 6 నుంచి 10 కిలో మీటర్ల వేగంతో వీచాయి.

న్యూస్‌రీల్


హేమావతి జాతరకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు



మడకశిర: అమరాపురం మండలంలోని హేమావతి సిద్ధేశ్వరస్వామి జాతర మహోత్సవానికి ప్రత్యేకంగా 18 ఆర్టీసీ బస్సులను నడపనున్నట్లు మడకశిర డీఎం రామసుబ్బయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్యంగా ఆదివారం జరిగే అగ్నిగుండ మహోత్సవానికి అమరాపురం నుంచి 10 బస్సులు, గుడిబండ నుంచి 4 బస్సులు, మడకశిర నుంచి 4 బస్సులను నడుపుతామన్నారు. అలాగే బుధవారం నిర్వహించినే బ్రహ్మరథోత్సవానికి కూడా ప్రత్యేక బస్సులను నడుపుతామని పేర్కొన్నారు. భక్తులు ఆర్టీసీ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

'వైకుంఠం'కు చుక్కలు

- సీటుపై హామీ లేక ప్రభాకర్ చౌదరిలో అసహనం



సాక్షి ప్రతినిధి, అనంతపురం: అనంతపురం అర్బన్ నియోజకవర్గం తెలుగు దేశం పార్టీ సీనియర్ నేత వైకుంఠం ప్రభాకర్‌చౌదరికి పార్టీ అధిష్టానం చుక్కలు చూపిస్తోంది. 2014లో టీడీపీ తరఫున ఎమ్మెల్యేగా పోటీచేసి గెలిచిన ఆయన 2019లో ఘోరంగా ఓడిపోయారు. ఇప్పుడు మళ్లీ పోటీచేయాలని తీవ్రంగా యత్నిస్తున్న చౌదరికి పార్టీ అధినేత చంద్రబాబు నుంచి స్పష్టమైన హామీ రాలేదు. ఇన్నేళ్లుగా పార్టీకి కష్టపడిన తనకు ఈ దుస్థితి ఏమిటని ప్రభాకర్‌చౌదరి కార్యకర్తల దగ్గర వాపోయినట్టు తెలుస్తోంది. ఇప్పుడు గనుక టికెట్ ఇవ్వకపోతే ప్రభాకర్ చౌదరి రాజకీయాలకు గుడ్‌బై చెప్పాల్సి వస్తుందని అనుచరులు వాపోతున్నారు.

తేల్చుకునేందుకు విజయవాడకెళ్లిన చౌదరి

గత రెండు మాసాలుగా టికెట్ కోసం యత్నిస్తున్న ప్రభాకర్‌చౌదరికి ఏ దశలోనూ హామీ లభించలేదు. తాజా పరిస్థితుల నేపథ్యంలో అనంతపురం అర్బన్ నియోజకవర్గంలో తెలుగుదేశం కేడర్ పరిస్థితి గందరగోళంగా ఉంది. ఈ పరిస్థితుల్లో అధిష్టానంతో తాడోపేడో తేల్చుకునేందుకు ప్రభాకర్ చౌదరి విజయవాడకు బయలుదేరినట్టు ఆయన అనుచరులు చెబుతున్నారు.

ప్రకటించకముందే ఓవరాక్షన్ ఎందుకు?

- గుమ్మనూరు నారాయణకు టీడీపీ నేత పవన్ గౌడ్ హితవు

గుంతకల్లు: తెలుగుదేశం పార్టీ అధిష్టానం గుంతకల్లు ఎమ్మెల్యే టికెట్ ఎవరికీ ప్రకటించకముందే ఓవరాక్షన్ ఎందుకు చేస్తున్నారని గుమ్మనూరు నారాయణకు ఆ పార్టీ బీసీ సెల్ అధికార ప్రతినిధి ఆర్.పవన్‌కుమార్ గౌడ్ హితవు చెప్పారు. ఆలూరు మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ గుమ్మనూరు నారాయణ శుక్రవారం సోషల్ మీడియాలో ఒక ప్రకటన విడుదల చేశారు. శనివారం గుంతకల్లులో టీడీపీ కార్యాలయం ప్రారంభిస్తున్నామని, నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని అందులో విజ్ఞప్తి చేశారు. ఈ విషయంపై స్పందించిన పవన్‌కుమార్ గౌడ్ విలేకరులతో మాట్లాడుతూ తమ పార్టీకి కొన్ని పద్ధతులు ఉన్నాయని, పరిధి దాటి ప్రవర్తించడం మంచిది కాదని హెచ్చరించారు. పార్టీ అధినేత చంద్రబాబు టికెట్ ఎవరికని ప్రకటించకముందే సొంత నిర్ణయాలు ఎలా తీసుకుంటారని ప్రశ్నించారు.

ఉద్యోగుల శ్రేయస్సే లక్ష్యం

- విద్యావ్యవస్థలో సమున్నత మార్పులు
- విద్యారంగానికి రూ.71 వేల కోట్ల ఖర్చు
- ఐదేళ్లలో ఆరు లక్షలకు పైగా ఉద్యోగాలు
- మహిళా పక్షపాతి సీఎం జగన్
- ఏపీ టీచర్స్ జేఏసీ విద్యా సదస్సు.. మహిళా దినోత్సవ సభలో వక్తలు

పుట్టపర్తి రూరల్: ఉద్యోగులు, ఉపాధ్యాయుల శ్రేయస్సే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారని ఎమ్మెల్సీ కల్పలతారెడ్డి అన్నారు. శుక్రవారం పుట్టపర్తి సాయి ఆరామంలో ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ జేఏసీ నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి, రమణారెడ్డి ఆధ్వర్యంలో విద్యా సదస్సు, మహిళ దినోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డి, పుట్టపర్తి ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి, రాష్ట్ర సచివాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కాకర్ల వెంకట్రామిరెడ్డి హాజరయ్యారు. కల్పలతారెడ్డి మాట్లాడుతూ దేశంలోని ఏ రాష్ట్రంలోనూ లేని విధంగా మన రాష్ట్రంలో అన్ని రంగాల్లో మహిళలకు 50 శాతానికి పైగా ప్రాధాన్యత దక్కుతోందన్నారు. పార్లమెంట్‌లో 33 శాతం మహిళా రిజర్వేషన్ బిల్లుకు ఆమోదం లభిస్తే.. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఇక్కడ మహిళలకు అంతకుముందే మంచి అవకాశాలు ఇచ్చారని గుర్తు చేశారు. మహిళా ఉపాధ్యాయులకు చైల్డ్ కేర్ లీవ్‌లను 60 రోజుల నుంచి 180 రోజులకు పెంచారన్నారు. వాటిని పిల్లల వయసు 18 ఏళ్లలోపు వాడుకోవాలన్న నిబంధనను తొలగించేందుకు సీఎం జగన్ హామీ ఇచ్చారన్నారు. ప్రతి మహిళా దినోత్సవానికి మహిళా ఉద్యోగులకు ఓ వరం ప్రకటించారన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి సీఎం జగన్ కట్టుబడి ఉన్నారని పునరుద్ఘాటించారు. మళ్లీ అధికారంలోకి వచ్చిన వెంటనే అన్ని సమస్యలు తప్పక పరిష్కరిస్తారన్నారు.



విద్యా సదస్సులో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కల్పలతా రెడ్డి, చిత్రంలో ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డి, పుట్టపర్తి ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి, సచివాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కాకర్ల వెంకట్రామిరెడ్డి, హిందూపురం పార్లమెంటు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త బోయ శాంతమ్మ తదితరులు



సదస్సులో పాల్గొన్న ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉద్యోగులు

కరోనా సమయంలోనూ అండగా ఉన్నారు

- రాష్ట్ర సచివాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కాకర్ల వెంకట్రామిరెడ్డి

కరోనా విపత్కర సమయంలోనూ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు అండగా సీఎం జగన్ నిలిచారని రాష్ట్ర సచివాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కాకర్ల వెంకట్రామిరెడ్డి కొనియాడారు. రెవెన్యూ లేక రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అగమ్యగోచరంగా ఉన్న సమయంలోనూ ఉద్యోగులకు జీతాలు చెల్లించారన్నారు. గ్రామ సచివాలయ వ్యవస్థ ఏర్పాటు చేసి రెండున్నర లక్షల ఉద్యోగాలు కల్పించారన్నారు. వలంటీర్ వ్యవస్థ ద్వారా ఇంటింటికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు. 50 వేల మంది ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేశారని, గత డీఎస్సీలకు సంబంధించి 6,800 మందికి ఉపాధ్యాయ పోస్టులు ఇచ్చారని గుర్తు చేశారు. రాష్ట్రంలో ఆరున్నర లక్షలకు పైగా ఉద్యోగావకాశాలు కల్పించడం అభినందనీయమన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలు సంపూర్ణంగా పరిష్కరించేందుకు రెండేళ్ల పాటు కరోనా మహమ్మారి అడ్డుపడిందన్నారు. ప్రభుత్వం ఏర్పడిన తక్షణమే 27 శాతం ఐఆర్ ప్రకటించారని గుర్తు చేశారు. మరోసారి ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు చేపట్టిన వెంటనే ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలు పూర్తిగా పరిష్కరిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.



రూ.6 వేల కోట్లతో పుట్టపర్తి అభివృద్ధి

- ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి

పుట్టపర్తి నియోజకవర్గ అభివృద్ధికి రూ.6 వేల కోట్లు ఖర్చు చేస్తున్నట్లు ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి తెలిపారు. రూ.864 కోట్లతో 193 చెరువులను కృష్ణా జలాలతో నింపే ఎత్తిపోతల పథకం పనులు ప్రారంభమయ్యాయన్నారు. నియోజకవర్గంలో 26 వేల పక్కాగృహాలు నిర్మిస్తున్నామన్నారు. ప్రతి గ్రామానికీ రోడ్లు వేశామని చెప్పారు. సుమారు రూ.2,700 కోట్లతో నియోజకవర్గం మీదుగా నాలుగు జాతీయ రహదారుల నిర్మాణం శరవేగంగా జరుగుతోందన్నారు. పుట్టపర్తిని పారిశ్రామికంగా అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించామన్నారు. పుట్టపర్తిని కార్పొరేషన్‌గా మారుస్తామన్నారు. ఐటీ హబ్‌గా తీర్చిదిద్దేందుకు 300 ఎకరాలు కేటాయించాలని ముఖ్యమంత్రిని కోరినట్లు తెలిపారు. ఇక్కడ ఉద్యోగులకు ఆప్షో దాన్ని ఇచ్చే విధంగా సౌకర్యాలు మెరుగుపరుస్తామన్నారు. నూతన జిల్లా ఏర్పాటుతో ఇక్కడి ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఆరు శాతం హెచ్‌ఆర్‌ఏ పెరిగిందన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయులు మరోసారి సీఎం జగన్‌మోహన్ రెడ్డికి అండగా నిలవాలని, పుట్టపర్తిలోనూ వైఎస్సార్‌సీపీని గెలిపించాలని కోరారు.



విద్యా వ్యవస్థలో సమూల మార్పులు

- ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డి

విద్యా వ్యవస్థలో సమూల మార్పులు తీసుకొచ్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డి అన్నారు. విద్య కోసం ఇతర రాష్ట్ర ప్రభుత్వాలు చేయని విధంగా ఏపీలో రూ.71 వేల కోట్లు ఖర్చు చేయడం అభినందనీయమన్నారు. నాడు–నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా తీర్చిదిద్దారన్నారు. రాజకీయ లబ్ధి ఆలోచించకుండా, ఓటర్లు కాకపోయినా విద్యార్థుల భవిష్యత్తు కోసం సీఎం జగన్ చేస్తున్న కృషి ఆదర్శప్రాయమన్నారు.



జగనన్నకు అండగా నిలవాలి

- వైఎస్సార్‌సీపీ హిందూపురం పార్లమెంట్ సమన్వయకర్త బోయ శాంతమ్మ

ఉద్యోగులు, ఉపాధ్యాయులు జగనన్నకు మరోసారి అండగా నిలవాలని హిందూపురం పార్లమెంటు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త బోయ శాంతమ్మ పిలుపునిచ్చారు. మీ సమస్యలన్నింటినీ పరిష్కరించేందుకు తప్పక కృషి చేస్తామన్నారు. అలాగే ఈ ప్రాంత అభివృద్ధికి పాటుపడతామన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కల్పలతారెడ్డిని, బోయ శాంతమ్మను మహిళా ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నాయకులు ,వందలాదిమంది ఉపాధ్యాయులు, ఉద్యోగులు పాల్గొన్నారు.



భారత్‌ను అద్భుతంగా తీర్చిదిద్దడమే లక్ష్యం



స్టాల్‌ను పరిశీలిస్తున్న ఖాదీ అండ్ విలేజ్ ఇండస్ట్రీస్ శాఖా మంత్రి మనోజ్‌కుమార్

హిందూపురం: 'ప్రధానమంత్రి నరేంద్రమోదీ పాలనలో దేశాన్ని అద్భుతంగా తీర్చిదిద్దడమే కేంద్ర ప్రభుత్వ లక్ష్యం. సమాగ్రాభివృద్ధి, అందరికీ సొంత ఇల్లు, ప్రతి ఇంటికీ నీళ్లు, మహిళాశక్తి, వికాస్ యోజన, పంటల బీమా, సోలార్ విద్యుత్ వంటి అభివృద్ధి సదుపాయాలతో ఆయుష్మాన్ భారత్‌గా వెలుగుతుందిది' అని ఖాదీ అండ్ విలేజ్ ఇండ్రస్టీస్ శాఖ మంత్రి మనోజ్‌కుమార్ అన్నారు. శుక్రవారం హిందూపురంలోని ఎంజీఎం క్రీడా మైదానంలో ఏర్పాటు చేసిన వివిధ చేతివృత్తుల యంత్రాలు, పరికరాల పంపిణీకి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో కేంద్ర మంత్రి మనోజ్‌కుమార్ మాట్లాడుతూ ఖాదీ గ్రామీణ పరిశ్రమ రంగంలో టర్నోవర్ రూ. 1.34 లక్షల కోట్లతో 950 లక్షల మందికి పైగా ఉద్యోగాలు కల్పించినట్లు చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో సంప్రదాయ పరిశ్రమలు కాపాడటం, కొండ ప్రాంతాల్లోని ఎస్సీ, ఎస్టీ మహిళలతో సహా పేద చేతివృత్తుల వారి జీవనోపాధిని పెంపొందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. 2022–23లో రాష్ట్రంలో ఖాదీ సంస్థలు రూ.47.58 కోట్ల ఉత్పత్తి , రూ 62.28 కోట్ల అమ్మకాలతో 7,942 మంది కళాకారులకు ఉపాధి కల్పించడం విశేషాభివృద్ధిగా చెప్పవచ్చన్నారు. అలాగే పీఎంఈజీపీ కింద 4,015 మంది లబ్ధిదారులకు 145.04 కోట్ల మార్జిన్ మనీ చేయడమేకాకుండా 32,120 మందికి ఉపాధి అవకాశాలు కల్పించినట్లు చెప్పారు. ఖాదీ విస్తరణ విజన్ కేవలం బట్టలు నేయడమే కాకుండా దేశవ్యాప్తంగా గణనీయమైన ఉపాధి ఆర్థిక సాధికారతను సృష్టిస్తుందన్నారు.

ఖాదీ ఎగ్జిబిషన్ ప్రారంభం

హిందూపురం రైల్వే కమ్యూనిటీ హాల్‌లో పీఎంఈజీపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రాష్ట్రస్థాయి ఖాదీ బజార్‌ను కేంద్ర మంత్రి మనోజ్‌కుమార్ ప్రారంభించారు. ఎగ్జిబిషన్‌లో ఏర్పాటు చేసిన వస్తువులను తిలకించి నిర్వాహకులతో మాట్లాడారు. కార్యక్రమంలో సౌత్ జోన్ డిప్యూటీ సీఈఓ మదన్‌కుమార్‌రెడ్డి, ముంబై జోన్ ప్రతినిధి నల్ల ముత్తు, బీజేపీ నాయకులు రమేష్‌రెడ్డి, ఆదర్శ్ కుమార్, తిరుమలేష్, చంద్రశేఖర్,శంకర్, తదితరులు పాల్గొన్నారు.

మహిళా సాధికారతకు జగనన్న కృషి



మహిళా దినోత్సవం సందర్భంగా కేక్ కట్ చేస్తున్న మంత్రి ఉషశ్రీ చరణ్

పెనుకొండ రూరల్: మహిళా సాధికారతకు కృషి చేస్తున్న సీఎం జగన్‌కు మహిళలు అండగా నిలవాలని మంత్రి ఉషశ్రీ చరణ్ పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా శుక్రవారం పట్టణంలోని 4వ వార్డులో మహిళలతో కలిసి కేక్ కట్ చేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రంలో మహిళా అభ్యున్నతే ధ్యేయంగా ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి కృషి చేస్తున్నారు. అందులో భాగంగానే మహిళలకు వైఎస్సార్ చేయూత, అమ్మఒడి, ఆసరా, కళ్యాణమస్తు తదితర సంక్షేమ పథకాలను ప్రభుత్వం ప్రవేశపెట్టిందన్నారు. నామినేటెడ్ పోస్టుల్లో మహిళలకు పెద్దపీట వేసినట్లు తెలిపారు.

పండుగ పూట విషాదం

- జాతరకు వెళ్తూ తిరిగిరాని లోకాలకు..
- రోడ్డు ప్రమాదంలో ఇద్దరి మృతి



మహేష్ (ఫైల్)



సాంబమూర్తి (ఫైల్)

తాడిమర్రి: మహాశివరాత్రి సందర్భంగా జాతరకు వెళ్తూ రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందిన ఘటన తాడిమర్రి మండలం దాడితోట సమీపంలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికుల వివరాల మేరకు... అనంతపురం జిల్లా కూడేరు మండలం అంతరగంగ గ్రామానికి చెందిన బుట్టా మహేష్ (32) సెంట్రింగ్ పనులు, అలాగే అనంతపురానికి చెందిన సాంబమూర్తి (61) టైలరింగ్ చేస్తూ కుటుంబాలను పోషించు కుంటున్నారు. ఈ క్రమంలో మహాశివరాత్రి సందర్భంగా ఇరువురు కలసి ద్విచక్ర వాహనంపై వైఎస్సార్ జిల్లా సింహాద్రిపురం మండలం బలపనూరు సమీపంలోని గొజ్జేపల్లిలో జరిగే దత్తాత్రేయ జాతరకు బయలుదేరారు. తాడిమర్రి మండలం దాడితోట సమీపంలోకి చేరుకోగానే ఈ రహదారి పార్నపల్లికి వెళుతుందా? అని అటుగా వెళ్తున్న ఓ రైతును అడిగారు. దాడితోట మీదుగా చాలా దూరం అవుతుంది. కొద్దిగా వెనక్కివెళ్లి బైపాస్ రోడ్డులో వెళితే 10 నిమిషాల్లోగా పార్నపల్లికి వెళ్లవచ్చని చెప్పాడు. దీంతో వారు వెనుతిరిగి బైపాస్ రోడ్డుకు వెళుతుండగా ధర్మవరం నుంచి పులివెందుల వెళ్తున్న ధర్మవరం డిపో ఆర్టీసీ అద్దె బస్సు వారి ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. ఈ ఘటనలో బుట్టా మహేష్ అక్కడికక్కడే మృతి చెందారు. సాంబమూర్తికి తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న ఎస్‌ఐ నాగస్వామి అక్కడికి చేరుకుని సిబ్బంది సాయంతో తన జీపులోనే అతన్ని ఆస్పత్రికి తరలించే ప్రయత్నం చేశారు. మార్గమధ్యంలో 108 వాహనం రాగానే క్షతగాత్రున్ని అందులోకి మార్చి అనంతపురానికి తరలించారు. ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సాంబమూర్తి చనిపోయాడు. మృతుడు మహేష్ భార్య, వలంటీర్‌గా పనిచేస్తున్న తేజశ్విని ప్రస్తుతం ఐదు నెలల గర్భిణి, ఒకటిన్నర సంవత్సరం ఉన్న కుమారుడు ఉన్నారు. సాంబమూర్తికి భార్య సరోజమ్మ, ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు.



ధర్మవరం అర్బన్: బచ్చునాగంపల్లి కాశీ విశ్వనాథస్వామి రథోత్సవంలో పాల్గొన్న భక్తులు



లేపాక్షి: వీరభద్రస్వామి ఆలయంలో కల్యాణోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం


హర హర మహాదేవ

సాక్షిబృందం: హర హర మహాదేవ శంభో శంకర నామస్మరణతో శైవ క్షేత్రాలన్నీ మార్మోగాయి. మహాశివరాత్రి సందర్భంగా జిల్లా వ్యాప్తంగా ఉన్న శివాలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి. శుక్రవారం ఉదయం నుంచే ఆయా ప్రాంతాల్లోని ఆలయాలకు భక్తులు క్యూ కట్టారు. కల్యాణోత్సవం, జాతర మహోత్సవాలు, రుద్రాభిషేకాలు, ప్రత్యేక హోమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున శివాలయాలకు చేరుకొని ఉపవాసం ఆచరిస్తూ పూజల్లో పాల్గొన్నారు. ఆలయాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేయడంతో రాత్రంతా భక్తిగీతాలు ఆలపిస్తూ జాగరణ చేశారు.

మద్దతు ధరతో రబీ ఉత్పత్తుల కొనుగోలు



పప్పుశనగ



వేరుశనగ

అనంతపురం అగ్రికల్చర్: రబీలో రైతులు పండించిన పప్పుశనగ, వేరుశనగను కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ)తో కొనుగోళ్లకు చర్యలు చేపట్టినట్లు మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ పెన్నేశ్వరి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. క్వింటా పప్పుశనగ రూ.5,440, క్వింటా వేరుశనగ రూ.6,377 ప్రకారం నాఫెడ్ ద్వారా కొనుగోలు చేసి సకాలంలో చెల్లింపులు చేస్తామని పేర్కొన్నారు. రబీలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 12,453 మెట్రిక్ టన్నుల పప్పుశనగ, 16,179 మెట్రిక్ టన్నుల వేరుశనగ కొనుగోలు చేయాలని లక్ష్యం నిర్దేశించినట్లు వెల్లడించారు. ఆర్‌బీకే వేదికగా రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయని తెలిపారు. ఈ-క్రాప్ ఆధారంగా రైతులు తమ వివరాలు నమోదు చేసుకుంటే త్వరలోనే కొనుగోళ్లు మొదలవుతాయన్నారు. కనీస మద్దతు ధర కన్నా బహిరంగ మార్కెట్‌లో అధికంగా ఉంటే అమ్ముకోవచ్చన్నారు. అంతకన్నా తక్కువగా ఎట్టి పరిస్థితుల్లోనూ అమ్ముకోకుండా కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

క్లుప్తంగా

తండ్రీకొడుకుల మధ్య ఘర్షణ

తాడిమర్రి: భూ వివాదంలో తండ్రీకొడుకుల మధ్య ఘర్షణ చోటు చేసుకుని ముగ్గురు గాయపడ్డారు. వివరాలు... తాడిమర్రి మండలం కునుకుంటకు చెందిన కప్పల యంగమునికి ప్రసాద్, చిన్న యంగముని అనే ఇద్దరు కుమారులున్నారు. తనకున్న ఐదు ఎకరాల తోటను ఇద్దరు కుమారులకూ ఆయన పంచి ఇచ్చారు. అయితే అర ఎకరా గురించి ఇద్దరి అన్నదమ్ముల మధ్య తరచూ వాగ్వాదం చోటు చేసుకునేది. ఈ క్రమంలో శుక్రవారం సాయంత్రం 5 గంటలకు కుమారులు ఇద్దరూ గొడవపడ్డారు. ఆ సమయంలో తండ్రి తన చిన్న కుమారుడు యంగమునికి మద్దతుగా మాట్లాడడంతో ఘర్షణ చోటు చేసుకుంది. ఘటనలో గాయపడిన ముగ్గురూ వేర్వేరుగా ధర్మవరంలోని ప్రభుత్వాస్పత్రిలో చేరి చికిత్స పొందుతున్నారు.

క్వారీలో పేలుడు - మహిళ మృతి



కిష్టమ్మ (ఫైల్)

లేపాక్షి: క్వారీలో పేలుడు కారణంగా ఎగిసి పడిన బండ రాయి షెడ్డు మీదపడి ఓ మహిళ మృతి చెందింది. పోలీసులు తెలిపిన మేరకు... లేపాక్షి మండలం మామిడిమాకుల పల్లికి చెందిన కిష్టమ్మ (58)... బయన్నపల్లి సమీపంలో ఉన్న గ్రానైట్ క్వారీలో కార్మికులకు వంటకూలీగా పనిచేస్తూ జీవనం సాగిస్తోంది. ఈ నేపథ్యంలో శుక్రవారం వంట చేసేందుకు వెళ్లిన ఆమె రేకుల షెడ్డులో కాయగూరలు తరుగుతున్న సమయంలో క్వారీలో బ్లాస్టింగ్ చేశారు. ఆ సమయంలో ఓ పెద్ద బండరాయి ఎగిరి షెడ్డు పైకప్పునకు వేసిన రేకులను చీల్చుకుని కిష్టమ్మ తలపై పడింది. ఘటనలో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. కాసేపటి తర్వాత అటుగా వెళ్లిన కార్మికులు విషయాన్ని గుర్తించి సమాచారం ఇవ్వడంతో పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ గోపి తెలిపారు. కాగా, మృతురాలి భర్త ఎనిమిదేళ్ల క్రితమే మృతి చెందాడు. అప్పటి నుంచి ఇద్దరు కుమారులు, ఓ కుమార్తెను ఆమె పోషిస్తోంది.

పాముకాటుతో యువకుడి మృతి

అమరాపురం: స్థానిక పీహెచ్‌సీ సమీపంలో నివాసముంటున్న తోకల ఈరక్యాతరాయప్ప కుమారుడు దినేష్ (21) పాముకాటుతో మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... గురువారం సాయంకాలం గ్రామ శివారులోని అజ్జయ్యస్వామి ఆలయంలో భజన కార్యక్రమానికి దినేష్ వెళ్లాడు. ఆ సమయంలో అక్కడి పొలాల్లో నుంచి వచ్చిన పాము కాటు వేసింది. విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు వెంటనే నాటు వైద్యం చేయించి పొరుగున ఉన్న కర్ణాటకలోని పురుశురామపురానికి తీసుకెళ్లారు. చికిత్సకు స్పందించక ఒక్కగానొక్క కుమారుడు మృతి చెందడంతో తల్లిదండ్రులు కన్నీటి పర్యంతమయ్యారు. ఘటనపై ఎస్‌ఐ జనార్దననాయుడు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.



పెనుకొండ రూరల్: భోగసముద్రం చెరువు వద్ద వెలసిన మహాధ్యాన శివుడి వద్ద భక్తుల సందడి



హిందూపురంలోని బసవనపల్లిలో దీపారాధాన చేస్తున్న భక్తులు



అమరాపురం: హేమావతిలో ప్రత్యేక అలంకరణలో సిద్ధేశ్వరస్వామి

శివోహం..

- జిల్లా వ్యాప్తంగా ఘనంగా మహాశివరాత్రి వేడుకలు
- భక్తులతో పోటెత్తిన ఆలయాలు
- శైవక్షేత్రాల్లో విశేష అభిషేకాలు

సమస్త లోకాన్ని తనలో నిలుపుకుని తానే లోకమైన విశ్వనాథుడు... ప్రతి ఇంటా కొలువుదీరాడు. ఆదిదేవుడైన పరమశివుడు మానవ జీవన తాత్త్వికతకు అతి సన్నిహితంగా ఉంటూ సుఖ దుఃఖాలు అనే ద్వంద్వాలన్నింటినీ ఏకం చేసే అద్వైతమూర్తిగా గోచరించాడు. శివ అనే రెండక్షరాలు పరబ్రహ్మ స్వరూపం. 'శి' అంటే పాపనాశనం. 'వ' అంటే ముక్తిప్రదానం అని వేదాలు చెబుతున్నాయి. ఈ రెండు అక్షరాలు ఒక్కసారి జపిస్తే సమస్త పాపాలు నశించి ముక్తికి మార్గం ఏర్పడుతుందని అంటారు. 'నామస్మరణాత్ అన్యోపాయం నహి పశ్యామో భవతరణే' అన్నారు ఎందరో గురువులు. అదే శివనామస్మరణమై శుక్రవారం జిల్లా అంతటా మార్మోగింది. మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా గ్రామగ్రామాన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆలయాలు భక్తులతో పోటెత్తాయి. భక్తులు ఉపవాస దీక్ష బూని ప్రత్యేక పూజలు, అర్చనలు, జాగరణ చేశారు. రుద్రాభిషేకాలు, శివ కల్యాణాలు, జపాలు, స్తోత్రాలు, కీర్తనలు అఖండ దీపారాధనలు, బిల్వ దళార్చనలు పెద్ద ఎత్తున సాగాయి.

– సాక్షి నెట్‌వర్క్:

సాయీశ్వర నామంతో పులకించిన పుట్టపర్తి

ప్రశాంతి నిలయం: మహాశివరాత్రి సందర్భంగా శుక్రవారం సాయీశ్వర నామంతో పుట్టపర్తిలోని ప్రశాంతి నిలయం పులకించింది. వేలాదిగా హాజరైన దేశవిదేశీ భక్తులు సత్యసాయి మహాసమాధి చెంత శివరాత్రి వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. సత్యసాయి విద్యాసంస్థల విద్యార్థులు సంగీత విభావరితో అలరించారు. యజుర్ మందిరం నుంచి సాయీశ్వర లింగాన్ని ఊరేగింపుగా సత్యసాయి మహాసమాధి చెంతకు చేర్చి సాయంత్రం ఏకాదశ ద్రవ్యాభిషేకం, మహారుద్రాభిషేకం నిర్వహించారు. అనంతరం అఖండ భజన సంకీర్తనలతో భక్తులు జాగరణ చేశారు.



ప్రశాంతి నిలయంలో అఖండ భజనలో పాల్గొన్న భక్తులు



బత్తలపల్లి: లలితాత్రిపుర సుందరి ఓంకారేశ్వర ఆలయంలో కల్యాణోత్సవం జరిపించిన దృశ్యం



తాడిమర్రి: కాటికోటేశ్వర క్షేత్రంలో ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు



ఎన్‌పీకుంట: తిమ్మమ్మ మర్రిమాను వద్ద భక్తుల సందడి



రొద్దం: పెన్నానది ఒడ్డున ఉన్న రుద్రపాద ఆశ్రమంలో భజన చేస్తున్న భక్తులు



ప్రశాంతి నిలయంలో విద్యార్థుల సంగీత కచేరి

వైఎస్ కుటుంబంతోనే మైనార్టీలకు సముచితస్థానం

కదిరి టౌన్: దివంగత వైఎస్సార్ కుటుంబంతోనే మైనార్టీలకు సముచిత స్థానం దక్కిందని రాష్ట్ర నూర్‌బాషా కార్పొరేషన్ చైర్మన్ రసూల్ సయ్యద్ అన్నారు. అదే బాటలో సీఎం వైఎస్ జగన్ నడుస్తూ అన్ని రంగాల్లోనూ మైనార్టీలు అభివృద్ధి చెందేలా చర్యలు తీసుకున్నారని పేర్కొన్నారు. శుక్రవారం కదిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త బీఎస్ మక్బూల్ అహ్మద్ నివాసంలో ఏరాపటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దివంగత నేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి మైనార్టీలకు 4 శాతం రిజర్వేషన్ కల్పించడం ద్వారా ఆ సామాజిక వర్గానికి చెందిన ఎందరో విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించి నేడు ఉన్నత స్థానంలో స్థిరపడ్డారన్నారు. సీఎం వైఎస్ జగన్ సైతం ఏడుగురుని ఎమ్మెల్యేలుగా, 9 మందిని కార్పొరేషన్ చైర్మన్లుగా, ఆరుగురిని ఎమ్మెల్సీలుగా చేశారన్నారు. గత టీడీపీ హయాంలో ఒక్కరికి మాత్రమే ఎమ్మెల్యేగా అవకాశం కల్పించారని గుర్తు చేశారు. మైనార్టీల అభ్యున్నతికి బాటలు వేసిన సీఎం వైఎస్ జగన్‌ను మరోసారి ముఖ్యమంత్రిగా చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. సమావేశంలో మాజీమంత్రి మహమ్మద్ షాకీర్, మాజీ సర్పంచ్ హుస్సేన్ పీరా, మైనారీ నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రసూల్ సయ్యద్

కదిరి, టీసీఏ గెలుపు



మ్యాన్ ఆఫ్‌ది మ్యాచ్ అర్జున్ టెండూల్కర్

అనంతపురం: అనంత క్రీడాగ్రామం వేదికగా శుక్రవారం జరిగిన అనంతపురం జిల్లా క్రికెట్ అసోసియేషన్ సీనియర్స్ ఏపీఎల్–20 మ్యాచ్‌లో కదిరి, టీసీఏ జట్లు గెలుపొందాయి.

ఏడీసీఏ క్యాంప్ కదిరి, క్రిక్ లవర్స్ మధ్య జరిగిన మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన కదిరి జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 178 పరుగులు చేసి 5 వికెట్లు కోల్పోయింది. జట్టులో డి.సాయిప్రణీత్ 51, కె.ప్రశాంత్ 48 పరుగులు సాధించారు. అనంతరం బ్యాటింగ్ చేసిన క్రిక్ లవర్స్ 18.4 ఓవర్లలో పది వికెట్ల నష్టానికి 158 పరుగులు చేసింది. 20 పరుగుల తేడాతో ఓటమి పాలైంది. టీసీఏ అనంతపురం, హెచ్‌సీఏ హిందూపురం జట్ల మధ్య జరిగిన మరో మ్యాచ్‌లో అనంతపురం జట్టు గెలుపొందింది. తొలుత బ్యాటింగ్ చేసిన హిందూపురం జట్టు నిర్ణీత 20 ఓవర్లలో ఆరు వికెట్లు కోల్పోయి 148 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్ చేసిన అనంతపురం జట్టు 16 ఓవర్లలోనే మూడు వికెట్ల నష్టానికి 150 పరుగులు చేసి విజయం సాధించింది. జట్టులో పి.అర్జున్ టెండూల్కర్ 50 బంతుల్లో 12 ఫోర్లు, 4 సిక్సర్లతో 95 పరుగులు సాధించి నాటౌట్‌గా నిలిచారు. మరో బ్యాటర్ సూర్యతేజ 27 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్సర్లతో 31 పరుగులు చేశారు. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డును అర్జున్ టెండూల్కర్ అందుకున్నారు.

హాస్యకథల రచయిత్రి జయలక్ష్మీరాజ్ మృతి



జయలక్ష్మీరాజ్

అనంతపురం కల్చరల్: జిల్లాకు చెందిన ప్రముఖ హాస్యకథా రచయిత్రి అక్కిరాజు జయలక్ష్మీరాజ్ (74) అనారోగ్యంతో బాధపడుతూ శుక్రవారం రాత్రి కన్నుమూశారు. డోన్‌కు చెందిన ఆమెకు అనంతపురానికి చెందిన శ్రీరామరాజ్‌తో వివాహమైంది. ముగ్గురు కొడుకులు ఉన్నారు. కుటుంబసభ్యులతో కలసి అనంతపురంలోని స్థిరపడిన ఆమె జిల్లా సాహిత్యంలో తొలితరం రచయిత్రిగా ఖ్యాతిగాంచారు. ఆమె రచనల్లో కొన్ని సినిమాలుగా కూడా వచ్చాయి. పొగబండి నేస్తం కథాసంపుటిని చదివిన ప్రఖ్యాత కవి డాక్టర్ సి.నారాయణరెడ్డి తన సొంత డబ్బుతో అచ్చు వేయించడమే కాక అవార్డునూ అందజేశారు. ఇటీవలే ఏపీ తెలుగు భాషా సంఘం ద్వారా తెలుగు భాషా సేవా పురస్కారమందుకున్నారు. ఆమె అంత్యక్రియలు శనివారం జరుగుతాయని కుమారుడు అక్కిరాజు సుధాకరరాజు తెలిపారు. కాగా, జయలక్ష్మీరాజ్ మృతిపై కేంద్రసాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ రాచపాలెం చంద్రశేఖరరెడ్డి, డాక్టర్ శాంతినారాయణ, పండిట్ రియాజుద్దీన్, ఏలూరు యంగన్న, ఆచార్య దేవకి, డాక్టర్ అనంత మాలతి సంతాపం తెలిపారు.

సీఎం జగనన్నతోనే మహిళా సాధికారత



కేక్ కట్ చేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ తదితరులు

- జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ
- వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఘనంగా మహిళా దినోత్సవం

అనంతపురం కార్పొరేషన్: సీఎం వైఎస్ జగనన్నతోనే రాష్ట్రంలో మహిళా సాధికారత సాధ్యమైందని, అన్ని రంగాల్లో మహిళలు అభివృద్ధి చెందేలా పెద్దపీట వేస్తూ వచ్చారని జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ కొనియాడారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. గిరిజమ్మతో పాటు ఆర్టీసీ జోనల్ చైర్‌పర్సన్ ఎం.మంజుల, డీసీసీబీ చైర్‌పర్సన్ ఎం.లిఖిత, పార్టీ మహిళా విభాగం జిల్లా, నగరాధ్యక్షురాళ్లు శ్రీదేవి, కృష్ణవేణి కేక్ కట్ చేసి, శుభాకాంక్షలు తెలిపారు. గిరిజమ్మ మాట్లాడుతూ... ప్రధానంగా మహిళలకు అత్యంత రాజకీయ ప్రాధాన్యత కల్పించింది వైఎస్సార్‌సీపీనేనన్నారు. ఈ విషయంగా సీఎం వైఎస్ జగనన్నకు తామెంతో రుణపడి ఉన్నామన్నారు. మంజుల మాట్లాడుతూ... పూలే, అంబేడ్కర్ ఆశయాల స్ఫూర్తితో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ మహిళల అభ్యున్నతికి సీఎం వైఎస్ జగనన్న బాటలు వేశారన్నారు. ఎం.లిఖిత మాట్లాడుతూ.. మహిళలు రాజకీయంగా ఎదిగేందుకు సీఎం జగనన్న తీసుకున్న చర్యలను కొనియాడారు. శ్రీదేవి, కృష్ణవేణి మాట్లాడుతూ... మహిళలు సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా పురోగతి సాధించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు.రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపే ధ్యేయంగా ప్రతి మహిళా పనిచేయాలని, మరోసారి సీఎంగా జగనన్నను చేసుకుందామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు డైరెక్టర్ శోభారాణి, మహిళా విభాగం జిల్లా ఉపాధ్యక్షురాలు రాధ, నాయకురాళ్లు సుహాసిని, అనిత, సుజాతరెడ్డి, పార్వతి, దేవి, ఉష, శోభాబాయి, ప్రసన్న పాల్గొన్నారు.

మద్యం తరలిస్తున్న ఇద్దరి అరెస్ట్

చెన్నేకొత్తపల్లి: బెల్టు షాపులకు అక్రమంగా మద్యాన్ని తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులు సెబ్ అధికారులకు పట్టుబడ్డారు. చెన్నేకొత్తపల్లి సెబ్ సీఐ లలితాదేవి, ఎస్‌ఐ శివప్రసాద్ తెలిపిన వివరాలు.. అడిషనల్ ఎస్పీ నాగభూషణ ఆదేశాలతో శుక్రవారం చెన్నేకొత్తపల్లి మండల పరిధిలోని పైలబోయలపల్లి, ఎన్ఎస్ గేట్ గ్రామాల్లో తనిఖీలు చేపట్టారు. ఎన్ఎస్ గేట్ వద్ద చంద్ర అనే వ్యక్తి నుంచి 10 మద్యం బాటిళ్లు, ఒక మోటరు సైకిల్, పైలబోయలపల్లిలో ఓబన్న అనే వ్యక్తి నుంచి 20 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. వీరిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. దాడుల్లో హెడ్ కానిస్టేబుల్ ఓబిరెడ్డి, కానిస్టేబుళ్లు మల్లికార్జున, ఓంప్రసాద్‌రెడ్డిలు పాల్గొన్నారు.

బహిష్కృత బీటర్‌కు రిమాండ్

తాడిపత్రి అర్బన్: కలెక్టర్ ఉత్తర్వులు ధిక్కరించి జిల్లాలోనే సంచరిస్తున్న బహిష్కృత మట్కా బీటర్‌ను పోలీసులు అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించారు. సీఐ మురళీకృష్ణ తెలిపిన మేరకు.... తాడిపత్రిలో నివాసముంటున్న మట్కా బీటర్ దూదేకుల కుళ్లాయప్పతో పాటు మరో ఆరుగురిని గత ఏడాది డిసెంబర్‌లో జిల్లా నుంచి బహిష్కరిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. అయితే కుళ్లాయప్ప కలెక్టర్ ఉత్తర్వులు ధిక్కరించి తాడిపత్రిలోనే సంచరిస్తున్న విషయాన్ని గుర్తించిన పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.

భాస్కర్‌రెడ్డిపై సస్పెన్షన్ ఎత్తివేత

చెన్నేకొత్తపల్లి: మండల పరిధిలోని పులేటిపల్లి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు బచ్చల భాస్కర్ రెడ్డిపై ఉన్న సస్పెన్షన్ ఎత్తివేస్తున్నట్లు పార్టీ మండల కన్వీనర్ గంగిరెడ్డిగారి నర్సిరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ మనేరు నరసింహులు తెలిపారు. చెన్నేకొత్తపల్లిలో శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడారు. పులేటిపల్లికి చెందిన బచ్చల భాస్కర్‌రెడ్డిపై పలు ఆరోపణలు రావడంతో ఆయన్ను 20 నెలల క్రితం పార్టీ నుంచి సస్పెండ్ చేశామన్నారు. ఈ విషయంపై జిల్లా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శంకర నారాయణ, రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి విచారణ చేశారన్నారు. అయితే బచ్చల భాస్కర్‌రెడ్డిపై వచ్చిన ఆరోపణలు నిరాధారమైనవని, కేవలం ప్రతిపక్ష పార్టీలు చేసిన కుట్రలో భాగమని తేలడంతో సస్పెన్షన్ ఎత్తివేస్తున్నామన్నారు. ఇక నుంచి ఆయన పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనవచ్చన్నారు.

హత్యాయత్నం కేసు నమోదు

గార్లదిన్నె: మండలంలోని పెనచర్లకు చెందిన ఎర్రిస్వామిపై హత్యాయత్నం కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన మేరకు... బుక్కరాయసముద్రం మండలం సిద్దరాంపురం గ్రామానికి చెందిన లలిత, సరిత అక్కచెల్లెళ్లు. వీరిద్దరినీ గార్లదిన్నె మండలం పెనకచెర్లకు చెందిన వేర్వేరు కుటుంబాలకు చెందిన యువకులతో వివాహమైంది. కొన్నేళ్ల క్రితం లలిత కుటుంబసభ్యులు బతుకు తెరువు కోసం హైదరాబాద్‌కు వెళ్లి, అక్కడే స్థిరపడ్డారు. ఈ క్రమంలో కొన్ని నెలల క్రితం కుటుంబంలో కలహాల కారణంగా సరిత తన భర్త ఎర్రిస్వామితో గొడవపడి హైదరాబాద్‌లోని తన సోదరుడు వేణు ఇంటికి చేరుకుంది. అప్పటి నుంచి ఆమె కాపురానికి రాలేదు. ఇటీవల వేణు పెనకచెర్లలోని తన పెద్ద అక్క లలిత ఇంటికి వచ్చాడు. విషయం తెలుసుకున్న ఎర్రిస్వామి శుక్రవారం ఉదయం ఆయన వద్దకెళ్లి తన భార్యతో ఫోన్‌లో మాట్లాడించాలని కోరాడు. ఆ సమయంలో వేణు ఫోన్ చేసి చెప్పడంతో తనకు మాట్లాడడం ఇష్టం లేదని ఆమె కట్ చేసింది. దీంతో అసహనానికి గురైన ఎర్రిస్వామి... వేణుతో గొడవపడి దాడి చేశాడు. ఘటనపై బాధితుడి ఫిర్యాదు మేరకు ఎర్రిస్వామిపై హత్యాయత్నం కేసు నమోదు చేసినట్లు స్టేషన్ హౌస్ ఆఫీసర్ ఫిరోజ్‌ఖాన్ తెలిపారు.

యువకుడి ఆత్మహత్య



ఎర్రిస్వామి (ఫైల్)

పెద్దపప్పూరు: చిన్నపాటి అంశానికే గొడవ పడి క్షణికావేశంలో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... గార్లదిన్నె మండలం యర్రగుంట గ్రామానికి చెందిన పడిగప్ప, నాగలక్ష్మి దంపతుల కుమారుడు ఎర్రిస్వామి (27) డిగ్రీ పూర్తి చేసి అనంతపురంలో కూలి పనులతో జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో గురువారం ఇంట్లో చిన్నపాటి విషయంగా కుటుంబసభ్యులతో గొడవ పడిన ఎర్రిస్వామి... పెద్దపప్పూరు మండలం ముచ్చుకోట అటవీ ప్రాంతంలో చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. శుక్రవారం తెల్లవారుజామున అటుగా వెళ్లిన వారు గుర్తించి సమాచారం ఇవ్వడంతో పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతుడి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ శరత్‌చంద్ర కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

చికిత్స పొందుతూ యువతి మృతి

గుమ్మఘట్ట: మండలంలోని నేత్రపల్లి గ్రామానికి చెందిన మాలశ్రీ (19) బళ్లారి విమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందింది. పోలీసులు తెలిపిన మేరకు.. గ్రామానికి చెందిన తిమ్మరాయుడు, లక్ష్మీ దంపతుల కుమార్తె మాలశ్రీ బొమ్మక్కపల్లికి చెందిన అనిల్‌కుమార్ ప్రేమించుకున్నారు. పెళ్లికి అమ్మాయి కుటుంబ సభ్యులు నిరాకరించడంతో మనస్థాపానికి గురై, పురుగుల మందు తాగింది. కుటుంబ సభ్యులు ఆమెను మెరుగైన చికిత్స కోసం బళ్లారి ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది. యువతి తండ్రి ఫిర్యాదుమేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వీరభద్రస్వామి రథోత్సవ వేడుకలు ప్రారంభం

వజ్రకరూరు: మండలంలోని తట్రకల్లులో వెలసిన భద్రకాళిసమేత వీరభద్రస్వామి రథోత్సవం శుక్రవారం ప్రారంభమైంది. ఉదయం గణపతిపూజ, రక్షాబంధన, ఉమామహేశ్వర కలశస్థాపన, రుద్రాభిషేకం, తీర్థ ప్రసాద వినియోగం, మంగళహారతి పూజలు జరిగాయి. 9న రుద్రాభిషేకం, గంగపూజ, అన్నదానం, తీర్థప్రసాద వినియోగం జరుగుతుంది. 10న రుద్రాభిషేకం, కల్యాణోత్సవం, అదేరోజు రథోత్సవం జరుగుతుందని అర్చకుడు రాఘవేంద్ర స్వామి తెలిపారు.